క్లుప్తంగా

ఓటు హక్కు వినియోగించుకున్న ముఖ్య నాయకులు



సిరా చుక్కను చూపిస్తున్న నాయకులు శేషుబాబు, నాగబాబు, ఆనందప్రకాష్

పాలకొల్లు సెంట్రల్: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా పాలకొల్లు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ నాయకులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. టీటీడీ బోర్డు డైరెక్టర్ మేకా శేషుబాబు, గుణ్ణం నాగ బాబు, ఎస్సీ కమిషన్ సభ్యుడు చెల్లెం ఆనంద ప్రకాష్, జెడ్పీటీసీ సభ్యుడు నడపన గోవింద రాజులు తదితరులు తమ పరిధిలో ఉన్న పోలింగ్ బూత్‌లలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో పోలింగ్ సరళిని పరిశీలించడంలో భాగంగా పాలకొల్లు మండలం దిగమర్రు గ్రామంలో పోలింగ్ బూత్‌ను పరిశీలించడానికి వచ్చిన నాయకులందరూ తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు మీడియాకు తెలియజేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు ముచ్చర్ల శ్రీరామ్, డిటిడిసి బాబు, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పోలింగ్

నరసాపురం రూరల్: నరసాపురం మండలంలో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మండలంలో గురువారం 169 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. రికార్డు స్థాయిలో ఓట్లు పోలైనట్లుగా ఎన్నికల అధికారులు తెలిపారు. నరసాపురం మండలంలో అక్కడక్కడా స్వల్ప తగాదాలు మినహా మిగతా చోట్ల ఎటువంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోలేదు. ఉదయం 7 గంటల నుంచే ఓటింగ్ సరళి ప్రారంభమైనప్పటికీ యంత్రాలు పనిచేయక పోవడంతో పలు చోట్ల పోలింగ్ ఆలస్యంగా సాగింది. మండలంలోని లక్ష్మణేశ్వరం, తూర్పుతాళ్లు, వేములదీవి ఈస్ట్ గ్రామాల్లో వైసీపీ అనుకూలుర పై కూటమి మూకలు ఘర్షణకు దిగారు. అలాగే చామకూరిపాలెం మోడిలోని ప్రాథమిక పాఠశాలలోఉన్న పోలింగ్ బూత్‌లోని అసిస్టెంట్ పీఓగా విధులు నిర్వహిస్తున్న ఓ మహిళా ఉద్యోగి కూటమి అభ్యర్థికి ఓటు వేయాలని ఓటర్లకు సూచించిందన్న ఆరోపణతో ఘర్షణ నెలకొంది. ఇదే విషయమై ఏఎంసీ చైర్మన్ గుబ్బల మోహనరావు ఆర్‌ఓకి పిర్యాదు చేశారు. ఉదయం పోలింగ్ మందకొడిగా ప్రారంభమైనప్పటికీ మధ్యాహ్నం నుంచి వేగవంతంగా నమోదైంది. ఎండ తీవ్రతను తట్టుకోలేక వృద్ధులు, మహిళలు కొన్ని గ్రామాల్లో సాయంకాలం పోలింగ్‌లకు వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు.

దొడ్డిపట్లలో ఓటు వేసిన అనంత శ్రీరామ్



దొడ్డిపట్లలో తన తండ్రి, బంధువుతో కలిసి ఓటు వేసిన గేయ రచయిత అనంత శ్రీరామ్

యలమంచిలి: ప్రముఖ సినీ గేయ రచయిత చేగొండి అనంత శ్రీరామ్ తన స్వగ్రామం దొడ్డిపట్లలో సోమవారం తన ఓటు వేశారు. తన తండ్రి రిటైర్డ్ ప్రిన్సిపల్ సత్యనారాయణమూర్తి, బంధువు సీతారామాస్వామి నాయుడుతో కలిసి పోలింగ్ కేంద్రానికి వచ్చిన శ్రీరామ్ సాధారణ పౌరుడిలా వరుస క్రమంలో నుంచి తన ఓటు హక్కు వినియోగించుకున్నారు.

ఓటు వేసిన ప్రముఖులు



ఓటు వేయడానికి వచ్చి చేతిపై సిరా చుక్కు వేయించుకుంటున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

భీమవరం: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా సోమవారం పలువురు ప్రముఖులు పోలింగ్ కేంద్రాలకు చేరుకుని తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. కాళ్ల మండలం పెదఅమిరం గ్రామంలోని బూత్ నంబర్ 116లో కలెక్టర్ సుమిత్‌కుమార్ దంపతులు ఓటువేశారు. అలాగే భీమవరం పట్టణంలోని గునుపూడి 117 బూత్‌లో శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేనురాజు ఓటు వేయగా, నరసాపురం వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల కుటుంబసభ్యులతో కలసి చింతలపాటి అచ్చుతరామరాజు మునిసిపల్ స్కూల్లోని 130వ పోలింగ్ బూత్‌లో ఓటు వేయగా ఆమె వెంట క్రిస్టియన్ మైనార్టీసెల్ చైర్మన్ మేడిది జాన్సన్ కూడా ఉన్నారు.

పోలింగ్ సరళిని పరిశీలించిన గ్రంధి

వీరవాసరం: వీరవాసరం మండలంలో సోమవారం జరిగిన ఎన్నికల పోలింగ్ సరళిని భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్, నరసాపురం ఎంపీ అభ్యర్థిని గూడూరి ఉమాబాల పరిశీలించారు. పోలింగ్ శాతం వివరాలను ఎన్నికల ప్రిసైడింగ్ ఆఫీసర్లను అడిగి తెలుసుకున్నారు.



రుస్తుంబాద స్కూల్ పోలింగ్ బూత్ వద్ద బారులు తీరిన ఓటర్లు



మొగల్తూరు 96,97 బూత్‌ల వద్ద బారులు తీరిన మహిళా ఓటర్లు

ఓటెత్తిన చైతన్యం



మొగల్తూరు 106 పోలింగ్ బూత్ వద్ద ఓటర్లకు అభివాదం చేస్తున్న చీఫ్ విప్ ప్రసాదరాజు



మొగల్తూరులో ఓటు వేసిన కృష్ణంరాజు సతీమణి



పట్టణంలో ఓటు హక్కు వినియోగించుకున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ కుటుంబం

- నరసాపురంలో ప్రశాంతంగా పోలింగ్
- ఎండను సైతం లెక్కచేయకుండా బారులు తీరిన ఓటర్లు

నరసాపురం: నరసాపురం పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి సోమవారం జరిగిన పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. నరసాపురం పట్టణంలో అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. మండుటెండను సైతం లెక్కచే యకుండా ఓటు వేయడానికి ఉత్సాహం చూపించారు. ఉదయం కొద్దిసేపు మందకొడిగా సాగిన పోలింగ్ 8 గంటలు నుంచి ఊపు అందుకుంది. మళ్లీ మధ్యాహ్నం కొద్దిగా మందగించింది. అయితే సాయంత్రం 4 గంటలు నుంచి ఓటర్లు బారులు తీరారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల హడావుడి, పెద్దపెద్ద క్యూలైన్లు కనిపించాయి. మధ్యాహ్నం పూట ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకుని సాయంత్రం ఓటు వేయడానికి పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. దీంతో కొన్ని పోలింగ్ కేంద్రాల వద్ద రాత్రి 8 గంటలు వరకూ కూడా పోలింగ్ సాగింది.

మహిళలు, వృద్ధులు కూడా ఉత్సాహంగా

ఓటు హక్కు వినియోగించుకోవడంలో మహిళలు ఉత్సాహం చూపించారు. చంటిపిల్లతో కూడా పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. వృద్ధులు, వికలాంగులు వీల్‌చైర్స్ సాయంతో పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. ఈవీఎంలకు సంబంధించిన సర్వర్లు నెమ్మదిగా పని చేయడంతో చాలా పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం పూట నెమ్మదిగా పోలింగ్ సాగింది. అయినా సరే గంటలు తరబడి ఓటర్లు ఎలాంటి అసహనం లేకుండా నిలబడి ఓటు హక్కు వినియోగించుకున్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద టెంట్‌లు వేశారు. అధికారులు మంచినీటి వసతి కల్పించారు. పోలింగ్ ప్రక్రియ మొత్తం ప్రశాంతంగా సాగిందని నరసాపురం అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో ఎం.అచ్యుత్ అంబరీష్ చెప్పారు.

ప్రశాంతంగా ముగిసిన ఎన్నికలు

మొగల్తూరు: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. అక్కడక్కడ చెదురు మదురు సంఘనలు మనిహా ఎటువంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోలేదు. సోమవారం ఉదయం ఏడు గంటలకు పోలింగ్ ప్రారంభమైనా మొగల్తూరులోని 96,97 బూత్‌లో ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ సుమారు నలభై నిమిషాలు ఆలస్యంగా ప్రారంభమైంది. ఉదయం ఏడు గంటల నుంచే పోలింగ్ ప్రారంభమైనా ఓటర్లు బారులు తీరే ఉన్నారు. మండుటెండను సైతం లెక్కచేయకుండా ఎండలోనే నిలబడి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వృద్ధులు, వికలాంగుల సైతం పోలింగ్ కేంద్రాలకు తరలి వచ్చి తమ ఓటును సద్వినియోగం చేసుకున్నారు. పోలింగ్ బూత్‌ల ఓటర్లు కూర్చోవడానిక వీలుగా కుర్చీలు, దాహం తీర్చుకోవడానికి తాగు నీరు ఏర్పాటు చేశారు. మండలంలో సుమారు 6 కేంద్రాలను సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించి అందుకు తగ్గట్లుగా తగిన పోలీస్ బందోబస్తు ఏర్పాటు ,ేశారు. అయితే కుక్కలవారితోట బూత్ వద్ద ఓటర్లు మధ్య వివాదం నెలకొనడంతో పోలీసులు సమస్యను పరిష్కరించారు. ముత్యాలపల్లి, కొత్తోట, పాతపాడు, పేరుపాలెం,కెపిపాలెం, మొగల్తూరులోని పలుకేంద్రాల్లో ఓటర్లు హుషారుగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దివంగత రెబల్ స్టార్ యూవీ కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవి మొగల్తూరులోని నెంబర్ 2 ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన 104వ పోలింగ్ బూత్‌లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం బయటకు వచ్చి ఓటర్లకు అభివాదం చేశారు. దయాల్దాస్‌పేట బూత్ వద్దకు వచ్చి పరిచయమున్న వారిని పలుకరించారు.

పోలింగ్ కేంద్రాలను సందర్శించిన ప్రసాదరాజు

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నరసాపురం అసెంబ్లీ అభ్యర్థి ముదునూరి ప్రసాదరాజు మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటింగ్ శాతాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. దయాల్‌దాస్‌పేట, 106 బూత్‌లలో అసెంబ్లీ, పార్లమెంట్ కంపార్ట్‌మెంట్‌ల వద్ద ఎమ్మెల్యే, ఎంపీ అని తెలిపే బోర్డులు ఏర్పాటు చేయకపోవడంపై పోలింగ్ సిబ్బందిపై ఆయన అసహనం వ్యక్తం చేశారు.

పాలకొల్లులో పోలింగ్ ప్రశాంతం

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు మండలంలోని 58 బూత్‌ల పరిధిలో సోమవారం నిర్వహించిన పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఎక్కడ ఎటువంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోలేదు. మండలంలోని యాళ్లవానిగరువు సెయింట్‌మేరీస్ స్కూల్‌లో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) కుటుంబ సమేతంగా వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్ కూడా అదే బూత్‌లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. మెడిసిన్ విద్యనభ్యసిస్తునన అక్కాచెల్లెళ్లు ప్రణీత, లిఖిత కొత్తగా ఓటు రావడంతో యాళ్లవానిగరువులోని పోలింగ్ బూత్ నెం.69లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. అలాగే పట్టణంలోని అల్లు వెంకటేశ్వరరావు మునిసిపల్ స్కూల్‌లో ఓటు వేసేందుకు వచ్చిన వృద్ధురాలిని స్థానికంగా విధుల్లో ఉన్న పోలీస్ వీల్‌చైర్‌లో సహాయంతో పోలింగ్ బూత్‌లోకి తీసుకెళ్లి సహాయం చేశారు.

ఓటింగ్ సరళిని పరిశీలన

పట్టణంలోని పలు బూత్‌లలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి), ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల పోలింగ్ సరళిని పరిశీలించారు. మండలంలోని లంకలకోడేరు, దగ్గులూరులో పోలింగ్ సమయం ముగిసిన అరగంట వరకు వేచి ఉండి ఓటు హక్కు వినియోగించుకున్నారు.

పాలకొల్లు పట్టణంలో..

పాలకొల్లు సెంట్రల్: రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినయోగించుకోవడానికి ఓటర్లు సోమవారం పోలింగ్ స్టేషన్ల వద్ద పెద్ద ఎత్తున క్యూ కట్టారు. ఎన్నికల సంఘం అధికారులు పెద్ద ఎత్తున ప్రచారం చేయడంతో ప్రజల్లో చైతన్యం కలగడంతో ఓటర్లు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. నియోజకవర్గంలో ఉన్న 1,95,057 మంది ఓటర్లకు గాను 190 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. అతి స్వల్ప వాగ్వివాదాలు తప్ప మిగిలిన సమయం అంతా అన్ని ప్రాంతాల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. కొన్ని బూత్‌ల్లో ఈవీఎంల్లో చిన్న చిన్న సమస్యలతో ఓటింగ్ ఆలస్యమైనట్లు ఓటర్లు తెలిపారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సరళి రాత్రి వరకూ కొనసాగుతూనే ఉంది. సాయంత్రం 6 గంటలకు పోలింగ్ సమయం ముగియడంతో ఆ సమయంలో గేటు లోపల ఉన్న ఓటర్లకు అవకాశం కల్పించారు. పోలింగ్ కేంద్రం గ్రౌండ్‌లో ఉన్న ప్రతి ఓటర్‌కు ఏ సమయమైనా అవకాశం ఇస్తామని అధికారులు చెప్పడంతో 6 గంటల లోపుగానే ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. దాదాపు 8 నుండి 8.30 గంటల వరకూ కూడా పోలింగ్ నిర్వహించారు. రాత్రి 7 గంటల వరకూ 76 శాతం పోలింగ్ అయినట్లు అధికారులు తెలిపారు. ఇంకా పోలింగ్ జరుగుతుండడంతో పోలింగ్ శాతం పెరిగే అవకాశం ఉందన్నారు.



పాలకొల్లు పట్టణంలోని లాకుల వద్ద ఓటింగ్ సరళిని పరిశీలిస్తున్న ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల



పంచాయితీరాజ్ కార్యాలయం పోలింగ్ బూత్‌లో వేచి ఉన్న ఓటర్లు

యలమంచిలిలో..

యలమంచిలి: మండలంలోని 32 గ్రామాలలో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఓటు వేయడానికి ఓటర్లు వెల్లువెత్తడంతో ప్రతి గ్రామంలోను పోలింగ్ కేంద్రాలు ఓటర్లతో కిక్కిరిశాయి. ఎండను సైతం లెక్క చేయకుండా మధ్యాహ్న సమయంలో కూడా ఓటర్లు ఓటు వేయడానికి బారులు తీరారు. దొడ్డిపట్ల పోలింగ్ కేంద్రం 39లో మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఈవీఎం మొరాయించడంతో ఓటర్లు ఇబ్బందులు పడ్డారు. రెండు గంటల పాటు ఈవీఎం పని చేయలేదు. అనంతరం ఈవీఎం మళ్లీ పని చేయడంతో ఓటింగ్ కొసాగించారు. చించినాడలో కూడా ఈవీఎం పని చేయలేదు. దీంతో అధికారులు మరొక ఈవీఎం తీసుకువచ్చి ఓటింగ్ కొనసాగించారు.



సిద్ధాంతంలో నీడలో సేదతీరుతున్న వృద్ధులు



శ్రీహరిపేటలో ఓటుహక్కు వినియోగం కోసం బారులు తీరిన ఓటర్లు



టేలర్‌హైస్కూల్ వద్ద ఓటు హక్కు వినియోగించుకోవడానికి బారులు తీరిన మహిళలు

ఉత్సాహంగా పోలింగ్

పెనుగొండ: ఆచంట నియోజకవర్గంలో సోమవారం ఉదయం ఓటింగ్ సరళి నెమ్మదిగా ప్రారంభమైంది. ఉదయం 7 గంటలకే ప్రారంభమైన ఓటింగ్ మందకోడిగా 9 గంటలకు కేవలం 11 శాతం మాత్రమే నమోదైంది. 11 గంటలకు 25.80 శాతం, 1 గంటకు 42.47 శాతం, నాలుగు గంటలకు 58.40 శాతం, 5 గంటలకు 72.40 శాతం నమోదు కాగా, 6 గంటలకే పోలింగ్ కేంద్రాల ప్రధాన ద్వారాలు మూసివేసి కేంద్రాల లోపల ఉన్న ఓటర్లుకు ఓటు వేసుకొనే హక్కును కల్పించారు. 7 గంటలకు 76.46 శాతం నమోదైంది. నియోజకవర్గంలో 180017 ఓట్లకు గాను, 7 గంటలకు 137635 మంది ఓటు హక్కు వినియోగించుకొన్నారు. వీరిలో పురుషుల్లో 88881 మందికి గాను, 66450 మంది, మహిళల్లో 91132 మందికి గాను 71183 మంది , ట్రాన్స్ జెండర్స్‌లో 4కుగాను ఇద్దరు ఓటు హక్కును వినియోగించుకొన్నారు. ఎండతాకిడి అధికంగా ఉన్నా ఓటర్లు నెమ్మదిగా పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. నియోజకవర్గంలో చెదురు మదురు సంఘటనలు తప్ప పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. 1 గంట సమయంలో ఎండ తాకిడికి వృద్ధులు, దివ్యాంగులు విలవిల్లాడారు. సిద్ధాంతం, పెనుగొండ, ఆచంటల్లోని అత్యధిక ఓట్లు ఉన్న పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ ఆలస్యంగా జరిగింది. దీంతో రాత్రి 9 గంటల వరకూ పోలింగ్ జరుగుతూనే ఉంది. వృద్ధులను ఆయా పార్టీల కార్యకర్తలు, నాయకులు పోలింగ్ కేంద్రాలకు తీసుకువచ్చి ఓటింగ్ వేయించుకోవడానికి ప్రయత్నించారు. మహిళా ఓట్లు ఎక్కువగా పోల్ కావడంతో వైఎస్సార్ సీపీలో ఉత్సాహం నెలకొంది.



సిద్ధాంతం ఘటాల దిబ్బలో ఎండలోనూ వేచి ఉన్న ఓటర్లు



వెంకట్రామపురంలో సహాయకుడితో ఓటు వేయడానికి వచ్చిన దివ్యాంగుడు



వృద్ధురాలిని పోలింగ్ కేంద్రానికి తీసుకువస్తున్న దృశ్యం



తూర్పుపాలెంలో ఓటు వేస్తున్న చెరుకువాడ శ్రీరంగనాథరాజు



తూర్పుపాలెంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న శ్రీరంగనాథరాజు



సరిపల్లిలో వీల్‌చైర్‌లో వచ్చి ఓటు హక్కు వినియోగించుకుని బయటకు వస్తున్న మహిళ



లక్ష్మణేశ్వరంలో ఓటు వేసేందుకు వీల్‌చైర్‌లో వచ్చిన వికలాంగుడు



శ్రీహరిపేటలో వృద్ధుడిని ఓటు వేయడానికి వీల్ చైర్‌లో తీసుకొస్తున్న దృశ్యం



పెనుగొండ ఎస్వీకేపీలో వృద్ధుడిని తీసుకువస్తున్న కుటుంబ సభ్యులు



పెనుగొండలో నాయకులు, కార్యకర్తలతో విజయ ధీమాతో శ్రీరంగనాథరాజు